# లైటు వెలిగింది!

-బులుసు-జీ-ప్రకాష్

**మా** వీధిలో విద్యుత్ స్తంభానికున్న ట్యూబ్‌ల్యాంప్ నెల్లాళ్లనుంచీ వెలగడంలేదు. వీధి దీపాలు పురపాలక సంఘం పరిధిలోకొస్తాయి. మా వార్డు కౌన్సిలర్‌ను కలిసి వీధి పేరు, పోల్ నంబరూ వేసి ఒక విజ్ఞాపన పత్రం సమర్పించాను

మా కౌన్సిలర్‌గారు, తను ఎలాగూ నెగ్గేశాను. ఐదేళ్ల వరకు వీడి అవసరం నాకేమిటి? అనుకోకుండా సాదరంగా ఆహ్వానించారు. ఇంటి వరండాలో ఆ వార్డు ప్రజల కష్టసుఖాలకి సంబంధించిన విజ్ఞాపన పత్రాలు స్వీకరించడానికి ఒక టేబుల్, ఇరవై కుర్చీలు ఏర్పాటు చేశారు.

"రేపు మీ ట్యూబ్‌లైటు వేయిస్తాను. మీరు వెళ్లిరండి మాస్టారూ!" అని నా విజ్ఞాపన పత్రాన్ని స్వీకరిస్తూ అన్నారు. ఎంత సౌజన్యమూర్తి!

కానీ ఏడు రేపులైనా మా వీధి ట్యూబ్‌లైట్ వెలగలేదు. మళ్లీ ఎనిమిదో రేపునాడు వెళ్లి మా కౌన్సిలర్ మహోదయుల్ని కలిసి- "అయ్యా! ఇంతవరకూ ఎవరూ ట్యూబ్‌లైటు వేయలేదండీ!" అని ఎందుకైనా మంచిదని మరో కాపీ ఇచ్చి విన్నవించుకున్నాను.

వోటు కోసం వాళ్లు ప్రజల్ని అడుక్కుంటారు. ఎన్నికల్లో నెగ్గేక వాళ్లని ప్రజలు అడుక్కోవాలి. ఏం చేస్తాం? అంతా ఖర్మ!

"ఇంకా వెయ్యలేదా? ఇవాళ లైటింగ్ సూపరింటెండెంట్‌కు గట్టిగా డోసిస్తాను. మీరు నిశ్చింతగా ఉండండి మాస్టారూ!" అన్నారు కౌన్సిలర్.

నెల్లాళ్లైనా లైటు వెలగలేదు. మళ్లీ వెళ్లేను.

"మీ అర్జీలో మీరొక్కరే సంతకం చేసేరుట. మొత్తం మీ వీధి వాళ్లందరూ సంతకం చెయ్యాలన్నాడండీ లైటింగ్ సూపరింటెండెంట్" అన్నారు కౌన్సిలర్.

మళ్లీ దేవుడా అని వెనక్కొచ్చి మరో అర్జీ తయారు చేసి, వీధిలో ఉన్నవాళ్లందరి సంతకాలూ చేయించి మర్నాడు కౌన్సిలర్‌ని కలిశాను. ఆయన అర్జీని స్వీకరించి "నేను తప్పకుండా లైటు వేయిస్తాను, మిమ్మల్ని ఇన్నిసార్లు తిప్పుతున్నందుకు నాకే సిగ్గేస్తోంది" అని వినయంగా అన్నాడు.

ఇంటికెళ్లిపోయేను. ఇంటి దగ్గర మా శ్రీమతి "వెళ్లిన పని అయిందా? కౌన్సిలర్ లైటు వేయిస్తానన్నాడా?" అనడిగింది. 'ఊ' అన్నాను.

రెండు మాసికాలైనా లైటు వెలగలేదు.

"పోనిద్దురూ! రెణ్నెల్లనించీ లేని లైటుకి ఇప్పుడు తొందరెందుకు? ఎప్పుడో అప్పుడు వేస్తారులెండి. ముందు కిరాణా కొట్టుకెళ్లి ఈ సామాను తీసుకురండి" అని ఓ మినీ లిస్టు ఇచ్చింది.

కంది పప్పు ... పావు కేజీ
పెసర పప్పు ... -డిటో-
మినప పప్పు ... అరకేజీ

కిరాణాకొట్టుకెళ్లి సామాను పట్టుకొచ్చేను. పొట్లాలు విప్పుతూ ఖాళీ డబ్బాల్లో పోస్తూ విస్తుపోయింది మా శ్రీమతి!

"ఏంవండోయ్! మీరు వీధి లైటు కోసం మన కౌన్సిలర్ గారికిచ్చిన కాయితాల్లా ఉన్నాయ్ ఇవి" అంది శ్రీమతి.

ఔను! మా వీధిలైటు వెలగలేదు కానీ, నేనిచ్చిన విజ్ఞాపన పత్రాలు ఎక్కడికెళ్లాయో- ఇప్పుడు లైటు వెలిగింది నాకు!

మా 'పూర్ పాలక సంఘం'లోని తీరు ఇది!

■

## భావాల పల్లకి

**ప్ర**తీ క్షణం నాలో ఆలోచన
అనుక్షణం నా ఎదురుగా ఏదో
ఓ అందం, ఓ సంఘటన, ఓ సమాజ సమస్య
తటస్థపడి, తట్టి లేపుతుంటాయి-
ఆ క్షణంలో నా ఎదలో
ఏదో వ్రాయాలనే తపన-
స్పందన కలిగించిన ఆ భావాన్ని-
పదాల రూపంలోకి మార్చి-
ఓ కవితగా కూర్చాలనే-
క్షణ క్షణం విహరిస్తూంటాను,
"భావాల పల్లకిలో"
"పదాలకై" పదసుమ కవితా మూలికా-
రూపకల్పనకై.

-శ్రీవెన్నెల